క్లుప్తంగా

నేడు దేవాలయ భూములకు వేలం పాటలు

రెంటచింతల: మండలంలోని మల్లవరంలో గల శివాలయం భూములకు(దేవుడు మాన్యాలకు) శనివారం బహిరంగ వేలం పాటలను దేవస్థానం ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 40 ఎకరాల మెట్ట భూమికి జరిగే ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ. 5 వేలు ధరావత్తు చెల్లించాలని ఆయన సూచించారు. పాట పాడుకున్న వారు 2025–2026 నుంచి 2027–2028 వరకు మూడేళ్ల కౌలు హక్కును పొందుతారని ఆయన పేర్కొన్నారు. ముందుగానే ప్రతి సంవత్సరం కౌలు చెల్లించి భూమిలో ప్రవేశించాలని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

సరస్వతి నది పుష్కరాల్లో భక్తులకు అన్నదానం



పిడుగురాళ్ల: పట్టణానికి చెందిన జూలకంటి శ్రీనివాసరావు ప్రయాగ్ రాజ్‌లోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సరస్వతి నది పుష్కరాలలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రయాగరాజ్, వారణాసీలలో 12 రోజులు అన్నదానం చేస్తామని జూలకంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు యాద అశోక్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పసుమర్తి మల్లికార్జున, కోశాధికారి జూలకంటి శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు లగిశెట్టి వినోద్, ప్రయాగరాజ్ పురోహితులు పవన్ శాస్త్రి పాల్గొన్నారు.

26న రెంటచింతల మండల సర్వసభ్య సమావేశం

రెంటచింతల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె. సరోజినీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులతో అభివృద్ధిపై సమీక్షతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, సీజనల్, అంటువ్యాధులు, ఇతర అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు.

1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులుండాలి

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో క్లాస్, సబ్జెక్ట్, సెక్షన్ వైజ్‌గా 1:20 నిష్పత్తిలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్. సుబ్బారావు కోరారు. నాదెండ్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూలులో పై విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఆ గ్రామానికి ప్రైవేటు బస్సు వచ్చే అవకాశమే లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. గ్రామ జనాభాను బట్టి 200–500 మంది విద్యార్థులు చేరే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి గ్రామానికీ ఒక మోడల్ ప్రైమరీ స్కూలు, ఒక ఉన్నత పాఠశాల సరిపోతాయన్నారు. చిన్న గ్రామాలైతే రెండు, మూడు గ్రామాలకు కలిపి ఒక ఉన్నత పాఠశాల సరిపోతుందని తెలిపారు.. తమ ఇంటి పక్కనే పాఠశాల ఉండాలని తల్లిదండ్రులు, తమ స్వగ్రామం, స్వంత మండలంలోనే ఉద్యోగం చేయాలనే ఆలోచనలకు ఉపాధ్యాయులు స్వస్తి పలకాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉండటం వల్ల విద్యా వ్యవస్థ సుస్థిరంగా ఉంటుందన్నారు.

19న ముండ్రువారిపాలెం ఉప సర్పంచ్ ఎన్నిక

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక ఈనెల 19న ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఉప సర్పంచ్ పాపసాని విజయలక్ష్మి ఏప్రిల్ 10న పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. వార్డు సభ్యులు 10 మంది ఉన్నారని వారిలో నుంచి ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుంటారన్నారు. ఎన్నికల అధికారి ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పర్యవేక్షణలో ఎన్నిక జరుగుతుందన్నారు. వార్డు సభ్యులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి పంచాయతీ కార్యదర్శి జి.వాసు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా నాగేంద్రస్వామి జన్మదిన వేడుకలు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద వేంచేసియున్న శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మి తిరుపతమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో నాగేంద్రస్వామి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

కార్యాలయం మార్పు..

సౌకర్యాల్లో ఏమార్పు!

- గురజాల సబ్ రిజిస్ట్రార్‌లో వసతులు కరువు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గురజాలలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గురజాల: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం లభించే వనరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. రిజిస్ట్రేషన్లతో ఆఫీసు సందడిగా ఉంటుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని సౌకర్యాలు, హంగులతో పల్లెగుంత రోడ్డులో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హుటాహుటిన మార్చేశారు. మార్పు చేశారే గానీ కార్యాలయంలో వసతులు కల్పించడంలో మాత్రం విఫలమయ్యారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కార్యాలయాన్ని పల్లెగుంత రోడ్డులో నుంచి బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద గల గ్రామ సచివాలయానికి మార్చారు. కార్యాలయంలో సిబ్బందికి అనుకూలంగా ఉన్నప్పటికీ ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయంలో నిత్యం 40 నుంచి 45 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. నిలువనీడ లేకపోవడంతో ప్రజలు ఎండలో వేచి ఉండాల్సి వస్తోంది. మండుటెండలో మాడి పోతున్నారు. కనీసం కార్యాలయంలో కూర్చునేందుకు కూడా కుర్చీలు కూడా అందుబాటులో లేవు.

వృద్ధులు, వికలాంగులకు తప్పని తిప్పలు

కార్యాలయంలో పలు పనులు నిమిత్తం వచ్చే వృద్ధులు, వికలాంగులకు సైతం తిప్పలు తప్పడం లేదు. కనీసం కార్యాలయం ముందు రేకుల షెడ్డు ఏర్పాటు చేసి ఫ్యాన్లు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు. కార్యాలయం వద్ద ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రిజిస్ట్రేషన్‌కు కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రజలు వస్తుండటంతో పార్కింగ్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయం వద్ద వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించక పోతే కనెక్షన్లు కట్



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

పిడుగురాళ్ల: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని, లేనిపక్షంలో కనెక్షన్లు కట్ చేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. పట్టణంలో శుక్రవారం అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీటీ కేసులు 22కి గాను రూ. 44 వేలు, అడిషనల్ లోడ్ 32కి రూ. 1.26 లక్షలు, మాల్ ప్రాక్టీస్ కేసులు 8కి రూ. 24 వేలు కలిపి మొత్తం 66 కేసులకు రూ. 2.94 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. వినియోగదారులు 50 శాతం సబ్సిడీతో అనధికార లోడును క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. కిలో వాట్‌కు ప్రస్తుతం డెవలప్మెంట్ చార్జి రూ. 2,000కు గానూ రూ. 100 చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పథకం జూన్ 30వ తేదీ వరకు మాత్రమే ఉందని వారు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్ ప్లేట్లు ఏర్పాటుకు కిలో వాట్‌కి 30 వేలు, రెండు కిలో వాట్లకు రూ. 60 వేలు, మూడు కిలో వాట్లయితే రూ. 78 వేలు సబ్సిడీ వస్తుందని వివరించారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు, ఈఈలు సీహెచ్. వెంకటేశ్వరరావు, ఎస్.ఎం. ప్రసాద్, డీఈఈ కె. రవికుమార్, ఎం. సతీష్‌కుమార్, ఏ.శివకుమార్, కె. కోటేశ్వరరావు, మాచర్ల డివిజన్ ఏఈ ఎస్. సింగరయ్య, పిడుగురాళ్ల డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. నాగ సురేష్‌బాబు, రూరల్ మండల ఏఈఈ లక్ష్మణాయక్ పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో పిడుగురాళ్ల విద్యార్థినికి ర్యాంక్



మేఘన

పిడుగురాళ్ల: ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన బి. మేఘన స్టేట్ 4వ ర్యాంక్‌ను సాధించింది. ఈ సందర్భంగా శారదా కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోనే తమ విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించడం అభినందనీయమని తెలిపారు. కోచింగ్ సెంటర్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఏపీఆర్‌జేసీలో ఫ్రీ సీట్లు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. స్కాలర్ స్కూల్‌లో పదో తరగతి చదివిన మేఘన పరీక్ష ఫలితాల్లో కూడా 656 మార్కులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కాలర్ డైరెక్టర్స్ శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

దుకాణాలపై దూసుకుపోయిన లారీ

- తప్పిన పెను ప్రమాదం
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు
- గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై కలకలం



దుకాణాలపై దూసుకుపోయిన లారీ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గంలో లారీ అదుపు తప్పి దుకాణాలపై దూసుకుపోయిన సంఘటనలో ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు మేరకు.. రాజమండ్రి నుంచి బెంగుళూరుకు ఎరువుల లోడుతో బయలు దేరిన లారీ మార్గమధ్యంలో శావల్యాపురం ప్రధాన కూడలి మార్గానికి రాగానే వినుకొండ నుంచి నరసరావుపేట వైపు వెళుతున్న లారీని ఢీకొట్టింది. దీంతో ఎరువుల లోడు లారీ డ్రైవరు సయ్యద్ జాకీర్ హుస్సేన్ ఒక్కసారిగా అదుపుతప్పాడు. రోడ్డు వెంబడి ఉన్న పిన్నెల్లి కోటేశ్వరరావు, హరిబాబు, సముద్రపు శ్రీనివాసరావు, భవరిశెట్టి కోటేశ్వరరావు, జవ్వాజీ అంజయ్య, జక్కా శ్రీనివాసరావు దుకాణాలన్నీ ముందుభాగం పూర్తిస్థాయిలో ధ్వంసం అయాయి. నిత్యం రద్దీగా ఉండే ఏరియాలో కావటం, మరో వైపు ఆటో స్టాండ్ ఉండటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈప్రమాదంలో హోటల్ భవరిశెట్టి కోటేశ్వరరావు దుకాణంలో సలసల కాలుతున్న వంట నూనె, గ్యాస్ సిలిండరు, కొంత మేర నగదు, సెల్‌ఫోను తదితర సామాగ్రి అంతా చెల్లాచెదురుగా అయాయి. గ్యాస్ సిలిండరు లారీ కింద భాగానికి వెళ్లటంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఏరియాలో ప్రజలను గుంపులు ఉండకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. వినుకొండ అగ్నిమాపక అధికారి బీర్నేడి నాగేశ్వరరావు సిబ్బంది ఫైరు ఇంజినుతో సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. బుస్సా ఆదినారాయణకు చెందిన ఆటో ముందు భాగం కొంతమేర దెబ్బతింది. జక్కా సాంబశివరావుకు గాయాలయ్యాయి. వినుకొండ పట్టణ సీఐ శోభన్‌బాబు, రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు, ఎస్సైలు లేళ్ల లోకేశ్వరరావు, యం.వి. కృష్ణారావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీలో ఇరుక్కుపోయిన డ్రైవరు జాకీర్ హుస్సేన్‌ను స్థానికుల ద్వారా క్యాబిన్ నుంచి బయటకు తీశారు. 108 అత్యవసర వాహనంలో స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. నిత్యం రద్దీగా ఉండే ఏరియాలో పెను ప్రమాదం తప్పిందని ప్రజలందరు ఊపిరి పీల్చుకున్నారు. క్రేన్ సహాయంతో దుకాణాల మధ్యలో ఇరుక్కోపోయిన లారీని పోలీసులు బయటకు తీసే సమయంలో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లికుండా చర్యలు చేపట్టారు.

నరసరావుపేటలో తిరంగా ర్యాలీ

నరసరావుపేట: ఉగ్రదేశం పాకిస్తాన్‌లో ఉగ్ర స్థావరాలను మట్టు పెట్టి శత్రుదేశం గుండెలపై తన్ని ప్రపంచానికి భారత దేశశక్తిని చూపిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేయడంలో భారత సైనికుల ధైర్య సాహసాలను స్మరించుకుంటూ తిరంగా యాత్ర నిర్వహించారు వీరోచిత పోరాటం చేసిన భారత సైనికులకు మద్దతుగా మేమున్నామంటూ నినాదంతో నరసరావుపేట పట్టణంలో కళాశాల వద్ద నుంచి మల్లమ్మ సెంటర్ వరకు చేపట్టిన తిరంగా ర్యాలీని నరసరావుపేట నియోజకవర్గం శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. సైనికులకు ధన్యవాదాలు తెలియజేశారు భరతమాత కీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గం ప్రజలు, టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు, ప్రజాసంఘాల నేతలు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు

ఆటో డ్రైవర్ పై దాడి

కొల్లిపర: ఆటో డ్రైవర్ పై దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చివలూరు గ్రామం శివారులో సంఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దావులూరు గ్రామానికి చెందిన గరిక నాగరాజు సొంత ఆటోలో ప్యాసింజర్లను ఎక్కించుకొని దావులూరు నుంచి తెనాలికి వెళుతున్నాడు. కమతావారిపాలేనికి చెందిన గరిక గోపి ఇంకో ఆరుగురిని తీసుకొని వచ్చి చివలూరు గ్రామం శివారులో ఆటోను ఆపి తనను కొట్టి తిట్టినట్లు నాగరాజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి. కోటేశ్వరరావు తెలిపారు.

రెండు నివాసాల్లో చోరీ

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఎవరూ లేని రెండు ఇండ్లను లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డ్రైవర్ నరవారి హనుమాసింగ్ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లారు. సింగ్ విధులు ముగించుకుని శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి రాగా, ప్రధాన తలుపుకు వేసి తాళాలు పగులగొట్టి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా గదుల్లో వస్తువులన్నీ అస్తవ్యస్తంగా ఉండటంతో చోరీ జరిగినట్టు గ్రహించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి ఇంట్లోకి దూరి బీరువాలోని రూ.20 వేల నగదు, 50 తులాల వెండి, 9 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకు పోయినట్లు బాధితులు చెబుతున్నారు.

మరో ఇంట్లో చోరీ యత్నం

సింగ్ ఇంటి ఎదురుగా ఉన్న దండా ప్రమీల నివాసంలోనూ చోరీ యత్నం జరిగింది. సదరు కుటుంబం కూడా స్థానికంగా లేకపోవడంతో తలుపు తాళాలు పగులగొట్టి అంతటా వెతికి విలువైన వస్తువులేమీ కనిపించక పోవడంతో వెళ్లిపోయారు. ఇదే విషయాన్ని ప్రమీలకు స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలాలకు వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం పిలిపించి ఆధారాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ టి. శివరామకృష్ణ తెలిపారు. అయితే దుండగులు ప్రొఫెషనల్ దొంగలు అయి ఉంటారని ఘటనా స్థలాల్ని పరిశీలించిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడిస్తున్నారు.

వాటర్‌ప్లాంట్ తగులబెట్టిన గుర్తు తెలియని దుండగులు

అమరావతి: మండల కేంద్రమైన అమరావతి పాండురంగస్వామి గుడి వీధిలోని జి.కె.వాటర్ ప్లాంట్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తగులబెట్టిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులందించిన వివరాల ప్రకారం గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు వాటర్ ప్లాంట్‌ను తగులబెట్టారని, ప్లాంట్ యజమాని జి.శశిరేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని సీఐ అచ్చియ్య తెలిపారు. సమీపంలోని దుకాణాలలో ఉన్న సీసీ పుటేజీని పరిశీలిస్తున్నామని ఆయన చెప్పారు.

చకచకా కేంద్రియ విద్యాలయం రహదారి పనులు



నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు కేంద్రియ విద్యాలయం నుంచి నరసరావుపేట రహదారి వరకూ నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.40 లక్షల వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మిస్తున్నారు. సెంటర్ డివైడర్‌తో రెండు పక్కల 20 అడుగుల వెడల్పు మేర సుమారు 90 మీటర్ల పొడవునా రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్మాణ పనులు ప్రారంభం కాగా, జూన్ నాటికి పూర్తికానున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు సౌకర్యవంతంగా వాహన రాకపోకలకు సమస్యలు తొలగిపోనున్నాయి. ఇప్పటికే నరసరావుపేట రోడ్డుపై కేంద్రియ విద్యాలయం సమీపంలో జీబ్రా లైన్లు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు తగ్గాయి. ఉపాధి హామీ పథకం నిధులతో నరసరావుపేట రోడ్డు నుంచి కేంద్రియ విద్యాలయం పడమర వైపు నుంచి కనపర్రు మీదుగా గుంటూరు రోడ్డులో రూ.28 లక్షల వ్యయంతో మెటల్ రోడ్డు పనులు కూడా జరుగుతున్నాయి.

ఇండియా బీచ్‌గేమ్స్-2025 పోటీలకు హర్షవర్ధన్ ఎంపిక



సత్తెనపల్లి: స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బేతాళం హర్షవర్ధన్ ఖేలో ఇండియా బీచ్ గేమ్స్–2025 సముద్రం స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21, 22 తేదీల్లో డయ్యూ డామన్ (యూటీ)లో జరగనున్న 5 కిలోమీటర్ల ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. గతంలో 2023–24 సంవత్సరంలో స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఓపెన్ వాటర్ 5 కిలోమీటర్లు స్విమ్మింగ్ పోటీల్లో ఉడిపి, బెంగళూరులో జరిగిన ఈవెంట్స్‌లో పాల్గొని రాణించాడు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన హర్షవర్ధన్‌ను ప్రగతి కళాశాల డైరెక్టర్లు దగ్గుపాటి శివబ్రహ్మారెడ్డి, ఎం.సుబ్బరాజు, షేక్ జానీ బాషా, డి.శ్రీనివాసరావు, యు.సోమేశ్వరరావు, ఒ.శ్రీనివాసచారీ తదితరులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

ఆంజనేయుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



బొడ్డురాయికి పూజలు నిర్వహిస్తున్న మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల/మాచవరం: శ్రీ అభయాంజనేయ స్వామి ఆశీస్సులు గురజాల నియోజకవర్గంలోని ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేగులగడ్డలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం, నాభి శిల(బొడ్రాయి) ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గురజాల నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కాసు మహేష్ రెడ్డి హాజరయ్యారు. ఆలయ పూజారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖాలతో ఆనందంగా జీవించేలా అభయాంజనేయస్వామి కరుణించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు అలవాల లక్ష్మీస్వామి, జక్కుల కొండలు, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముక్కంటి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ యలమంద, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే రోగాల నుంచి రక్షణ



దాచేపల్లిలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



రెంటచింతలలో ర్యాలీని నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

దాచేపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రోగాల బారి నుంచి తప్పించుకోవచ్చని డాక్టర్ మధు తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా దాచేపల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధు మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరుగుతాయన్నారు. దోమ కాటు వల్ల డెంగీ బారిన పడే ప్రమాదం ఉందని చెప్పారు. డెంగీ అనుమానిత లక్షణాలు ఉంటే తక్షణమే పీహెచ్‌సీలో చేరి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, దోమల తెరల వాడకం మంచిదని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పట్టాభి, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెంటచింతలలో..

పరిశీలించండి...శుభ్రం చేయండి...మూతలు పెట్టండి అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించి డెంగీ రహిత పౌర సమాజం కోసం అందరం పాటుపడదామని మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నంశెట్టి అంకమ్మరావు తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ, ఆరోగ్య, మలేరియ సిబ్బంది, ఆశా కార్యకర్తలో కలిసి రెంటచింతలలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ నీటి నిల్వలను తొలిగించడం, డబ్బాలకు మూతలు పెట్టడం వంటి చిన్న చర్యలే డెంగీ నియంత్రణకు కీలకమన్నారు. ఈ కార్యక్రమం కీటకజనిత వ్యాధుల నియంత్రణ జాతీయ కార్యక్రమంలో భాగంగా కొనసాగుతోందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, దోమ కాటు ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఓ ఏడీ శర్మ, ఆంజనేయులు, ఎస్‌యూఓ గౌస్, సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, మలేరియా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

కోరిన ఏఐటీయూసీ నాయకులు



శిబిరంలో సీహెచ్‌ఓలకు సంఘీభావం తెలిపిన ఏఐటీయూసీ నాయకులు

నరసరావుపేట: జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ)ల సమస్యల పరిష్కారానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృషి చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఉద్యోగాల భద్రతతో పాటు పలు సమస్యల పరిష్కారానికి స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కు వద్ద 19రోజులుగా సీహెచ్‌ఓలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో గత ఏడేళ్లుగా ఆయా పంచాయతీ పరిధిలో ఆరోగ్య సేవలను అందిస్తున్న సీహెచ్‌ఓల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం, రావలసిన బెనిఫిట్స్ కోసం చేపట్టిన దీక్షలు 19వ రోజుకు చేరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. ఏపీఎంసీఏ అసోసియేషన్ జిల్లా నాయకులు అనుపమ, సాగర్, రాము మాట్లాడుతూ ఆరేళ్లు పూర్తిచేసుకున్న ప్రతి సీహెచ్‌ఓను రెగ్యులర్ చేయాలని, 23% ఇంక్రిమెంట్, జాబ్ చార్ట్ అమలు చేయడం, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా నాయకులు రాము, మస్తాన్. శివ, కోటి, కమల, గాంధీ స్మారక సమితి వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్, ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, చక్రవాకం సత్యనారాయణరాజు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



బొల్లాపల్లి : ప్రొహిబిషన్ /ఎక్సైజ్ ఈపూరు స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని, అవి సక్రమంగా పనిచేసేలా చూడాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు మద్యం దుకాణాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, వాటి పనితీరును పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరమని చెప్పారు.

ప్రగతి విద్యాసంస్థల అధినేత అచ్చయ్యకు బెయిల్ మంజూరు

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన ప్రగతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్యపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. గత కొంత కాలంగా ప్రగతి విద్యాసంస్థల పరిధిలోని అమరావతి పాఠశాలకు సంబంధించిన విషయంలో అచ్చయ్య, మరో వర్గానికి మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రత్యర్థి వర్గం అచ్చయ్య నుంచి బలవంతంగా పాఠశాలను స్వాధీన పరుచుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య సమావేశాలు, సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ అవి ఫలించకపోవడంతో ప్రత్యర్థి వర్గం ఒత్తిళ్ల మేరకు డాక్టర్ మక్కెన అచ్చయ్యపై సెక్షన్ 307 కింద గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు మరో 10 మందిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని కూడా బయటకు వెల్లడించలేదు. శుక్రవారం అచ్చయ్యను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఏరియా వైద్యశాలలో అచ్చయ్యకు వైద్య పరీక్షలు నిర్వహించి, సబ్ జైలుకు తరలించే క్రమంలో బెయిల్ మంజూరైంది.

బస్టాండ్‌లో స్లాబ్‌కు మరమ్మతులు

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో స్లాబ్ పెచ్చులూడి పడటాన్ని సివిల్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తనిఖీ చేశారు. లూజుగా ఉన్న స్లాబ్ వర్క్ చేసే నిమిత్తం టెండర్లు పిలిచి మరమ్మతులు పూర్తి చేసినట్లు డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ శుక్రవారం తెలిపారు. కంట్రోల్ పాయింట్ వద్ద కూడా మైక్ పెట్టి ప్రయాణికులకు సమాచారం సిస్టం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.